క్లుప్తంగా

కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్ అందజేస్తున్న పాఠశాల జూనియర్ అసిస్టెంట్ నూకల కోటిరెడ్డి

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల జూనియర్ అసిస్టెంట్, లయన్స్ క్లబ్ సభ్యుడు నూకల కోటిరెడ్డి రూ.30 వేల విలువ గల కంప్యూటర్, విద్యార్థులకు రూ.15 వేల విలువ గల దుస్తులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కట్టా శ్రీనివాస్‌రెడ్డి, విశ్వనాథ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కట్టా మాధవి, శ్రీదేవి, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి, శంకర్, సభియా, షబినా తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంస్థలపై అవగాహన పెంచుకోవాలి



మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులతో కమిషనర్

కోదాడ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు సేవలందించే ప్రభుత్వ సంస్థల గురించి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి కోరారు. గురువారం పట్టణ పరిధిలోని న్యూ విజన్ పాఠశాల విద్యార్థులు కోదాడ పురపాలక సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అందిస్తున్న సేవలు, మున్సిపాలిటీలోని వివిధ విభాగాల గురించి ఆయన వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ కోతలు సరికాదు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో అనధికారికంగా కరెంటు కోతలు విధించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో తరుచూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోవడంతో విద్యుత్ అంతరాయం కలుగుతోందని అయినా విద్యుత్ లైన్‌మెన్‌లు స్పందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీపతిరెడ్డి

కోదాడ : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు శ్రీపతిరెడ్డి, ప్రమీల కోరారు. గురువారం కోదాడలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ సేవా విభాగం, తిరుమల పారా మెడికల్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్ తీసుకోవద్దన్నారు. విద్యార్థులు రక్తదానం చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వేముల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శ్రీనివాస్, జోత్స్న, దేవమణి, లక్ష్మీనారాయణ, యాదగిరి, బలభీమారావు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సింహగర్జనను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మునగాల : సూర్యాపేటలో సెప్టెంబర్ ఐదవ తేదీన నిర్వహించబోయే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. గురువారం మండలంలోని ఆకుపాములలో బీసీ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ కేవలం 23 అసెంబ్లీ సీట్లు కేటాయించడం అన్యాయమన్నారు. చట్టసభలలో రిజర్వేషన్ ప్రకారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అమరగాని గురుస్వామిగౌడ్, సతీష్‌గౌడ్, అశోక్, మణికంఠ, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో విజయం నాదే

● ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



నేరేడుచర్ల : చిల్లేపల్లి మూసీ నది వద్ద గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : రాబోయే ఎన్నికల్లో హుజూర్‌నగర్‌లో విజయం తనదేనని, భారీ మెజార్టీతో గెలుస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థిగా తన పేరును ప్రకటించిన తరువాత మొదటిసారిగా నియోజకవర్గం వచ్చిన ఎమ్మెల్యే సైదిరెడ్డికి మండలంలోని చిల్లేపల్లి మూసీ నది వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సైదిరెడ్డి మూసీ నది వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ర్యాలీతో నేరేడుచర్ల చేరుకొని అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే తనను గెలుపుబాటలో నడిపిస్తుందన్నారు. గత మూడేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, కిష్టపాటి అంజిరెడ్డి, కౌన్సిలర్లు బాషా, సరిత, సాయి, లలిత, నాగవేణి, సులోచన, గ్రంథాలయ చైర్మన్ మార్కెండేయ, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి సైదులు, నాయకులు శ్రీకాంత్, లింగయ్య, తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

హుజూర్‌నగర్ : తెలంగాణలో రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే సైదిరెడ్డికి హుజూర్‌నగర్ అసెంబ్లీ టికెట్ ప్రకటించిన తర్వాత గురువారం హైదరాబాద్ నుంచి హుజూర్‌నగర్ వచ్చిన ఆయనకు గజమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తాను పడ్డ శ్రమకితోడు ప్రజల అండతో సీఎం కేసీఆర్ మళ్లీ టికెటిచ్చి ఆశీర్వదించారని అన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు పైరవీలు, పదవుల కోసం పాకులాటడం తప్ప పరిపాలనకు పనికి రారని ఆరోపించారు. కాంగ్రెస్, ఉత్తమ్ పని అయిపోయిందని, ఆయనను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు కాబట్టే బీఆర్‌ఎస్‌లో చేరే ప్రయత్నం చేశారని ఆరోపించారు. హుజూర్‌నగర్‌లో మళ్లీ ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే అని ఉత్తమ్, ఆయన సతీమణి ఇద్దరూ ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, కౌన్సిలర్లు శంభయ్య, ఫణికుమారి, రాంగోపి, మంగమ్మ, సౌజన్య, వి.నాగేశ్వరరావు, నాయకులు హరిబాబు, గోపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం

హుజూర్‌నగర్‌రూరల్ : బీఆర్‌ఎస్ పార్టీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును ప్రకటించిన సందర్భంగా మండలంలోని గోపాలపురంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే శానంపైడి సైదిరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సాతులూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీటీసీ చీకూరి రాజారావు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ముడెం గోపిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సుందరయ్య, హుస్సేన్‌మియా, నబి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

గరిడేపల్లి : బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి మరోసారి టికెట్ సాధించినందుకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం గరిడేపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని సాయిబాబా గురువారం ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రమీలావెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ స్వప్న నాయకులు పాల్గొన్నారు.

'భగీరథ' నీటి సమస్య ఏకరువు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ భూక్యా గోపాల్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను సభలో ఏకరువు పెట్టారు. గుడుగుంట్లపాలెం ఎంపీటీసీ వెంకటయ్య మాట్లాడుతూ యల్లాపురంలో మిషన భగీరథ నీరు సరఫరా కావడం లేదని తెలిపారు. కల్మేట్‌తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని జాన్‌పహాడ్ ఎంపీటీసీ విజయ అన్నారు. బెట్టెతండాలో భగీరథ నీళ్ల సరఫరా కావడం లేదని, గ్రామ పంచాయతీ బోర్లు సైతం అడుగంటాయని సర్పంచ్ మోతీలాల్ సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన భగీరథ ఏఈ నీటి సమస్య త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అలాగే బోర్లు, బావుల కింద వరి పొలాలు ఎండుతున్నాయని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సాగర్ ఎడమ కాల్వకు సాగు, తాగునీరు విడుదల చేయాలని తీర్మానించారు. అధికారులు తమతమ నివేదికలు చదివి వినిపించారు. వీటిపై ప్రజాప్రతినిధులు పలు సమస్యలు, అనుమానాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ దయాకర్, వైస్ ఎంపీపీ ఉపేందర్ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు

మేళ్లచెరువు : గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు కోరారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ప్రజాప్రతినిధులు విద్యుత్, తాగునీరు, ఆరోగ్యం, రోడ్లు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో హరితహారం విజయవంతం చేయడంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అధికారులు ప్రజా సమస్యలపై స్పందించి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఏపీఓ శైలజ, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ సైదానాయక్, పశువైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, ఎంపీఓ వీరయ్య, ఏఈలు శివకుమార్, రంగరాజు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నియోజకవర్గమంతా అవినీతిమయం

● బీసీ యువజన నాయకుడు అంజియాదవ్



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంజియాదవ్, నాయకులు

కోదాడ : కోదాడ నియోజకవర్గం గడిచిన ఐదు సంవత్సరాలలో అన్ని రంగాలలో అవినీతిలో కూరుకుపోయిందని, అవినీతి రహిత కోదాడ కోసం విద్యావంతులు, బడుగు బలహీన వర్గాలు తనకు అండగా నిలవాలని బీసీ యువజన నాయకుడు డాక్టర్ అంజియాదవ్ కోరారు. మన ఊరుకు.. మనగడపకు అంజియాదవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కోదాడలో ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నెల రోజులుగా కోదాడ నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో తాను పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నానన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన అవినీతి అక్రమాలే కనిపిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని యువత తనకు మద్దతుగా నిలిస్తే నీతివంతమైన కోదాడ కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌నాయుడు, కమలాకర్, వినయ్, శ్రీకాంత్, వెంకన్న, గోపి, నవీన్, బాబు, శ్రీవాణి, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీజీ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన

హుజూర్‌నగర్ : ఇటీవల విడుదల చేసిన పీజీ సెట్ ఫలితాల్లో హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సీట్లు సాధించారు. కొల్లు కార్తీక్ ఎంఏ హిస్టరీ విభాగంలో 22వ ర్యాంక్, టేకు వెంకటేశ్వర్లు పొలిటికల్ సైన్స్ విభాగంలో సీటు సాధించారు. గురువారం వారిని కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చందా అప్పారావు, హిస్టరీ అధ్యాపకుడు జి.సైదులు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ఎస్.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఇస్రో శాస్త్రవేత్త సుష్మ తల్లిదండ్రులకు సన్మానం



ఇస్రో శాస్త్రవేత్త సుష్మ తల్లిదండ్రులతో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

గరిడేపల్లి : చంద్రయాన్– 3 విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇస్రో శాస్త్రవేత్త బండ సుష్మ తల్లిదండ్రులు బండా నర్సిరెడ్డి– మాధవిలను నేరేడుచర్లకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు గురువారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, నోముల మల్లేశం మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అద్భుతం సృష్టించిందని, ఇంతటి చారిత్రాత్మకమైన విజయంలో పాలు పంచుకున్న సుష్మ తల్లిదండ్రులు అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాచకొండ శేఖర్, మాశెట్టి మోహన్, తాటికొండ శ్రీనివాస్‌రెడ్డి, గెల్లి శ్రీనివాస్, సపావత్ రాము, డాక్టర్ ఉపేందర్, దేవిరెడ్డి నాగిరెడ్డి, వీరవెల్లి వెంకటేశ్వర్లు, గోళ్ల శ్రీనివాస్, వరప్రసాద్, నోముల రవి, శ్రీను తదితరులు ఉన్నారు.

కోదాడలో కాంగ్రెస్ విజయం ఖాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి

కోదాడ : రానున్న ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని, తాను కోదాడలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టీపీసీసీకి దరఖాస్తు చేసుకున్నానని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి తెలిపారు. గురువారం ఎంఎస్ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకు మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గత నెల రోజులుగా నియోజకవర్గంలో పర్యటించినట్లు తెలిపారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ అవకాశం ఇస్తే తాను పోటీ చేస్తానని, 40 వేల మెజార్టీతో గెలుపొందుతానని దీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పందిరి ఫౌండేషన్ సలహాదారు ఎస్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓ విధులు మినహాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పాలకవీడు : అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు బీఎల్ఓలుగా విధులు నిర్వహించడంతో అదనపు పని భారం పడి ఒత్తిడికి లోనవుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు బీఎల్ఓ విధులు మినహాయించాలని కోరుతూ మండల అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్య, ఆరోగ్య లక్ష్మి, గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం తయారు చేయడం ఇలా 24 రకాల సేవలు ఆన్‌లైన్ చేయడంతో సమయం సరిపోవడం లేదని, దీనికి తోడు బీఎల్ఓ విధులు నిర్వర్తించడంతో ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. బీఎల్ఓ విధుల నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడీలు వసుంధర, మణెమ్మ, నిర్మల, ఇందిర, స్వాతి, కమళ, సరిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చాలి



హుజూర్‌నగర్‌లో ట్రాక్టర్ పైనుంచి పడిపోయిన వడ్లబస్తాలను చూపుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ సైదా, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు జక్కుల మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మెయిన్ రోడ్డుపై గుంతల వల్ల ట్రాక్టర్ నుంచి జారి పడిపోయిన వడ్ల బస్తాలను ఎత్తుతున్న రైతులకు సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎస్‌ఆర్ సెంటర్ నుంచి ఇందిరా చౌక్ వరకు ఒక పక్కరోడ్డు పూర్తిగా గుంతలమయం అయిందన్నారు. రోడ్డుపై వాహనదారులు నరక యాతన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. రెండు రోజుల్లో రెండు సార్లు ట్రాక్టర్‌పై నుంచి వడ్ల బస్తాలు పడిపోయాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పైపుల లీకేజీని అరికట్టి రోడ్డుపై గుంతలు లేకుండా చేయాలని వారు కోరారు.

చంద్రయాన్-3 విజయం దేశానికి గర్వకారణం



నేరేడుచర్లలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : చంద్రయాన్– 3 విజయవంతం కావడం భారతదేశానికి గర్వకారణమని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు అన్నారు. చంద్రయాన్– 3 విజయవంతమైన సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో సమావేశం నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి.చంద్రశేఖర్, మోహినుద్దీన్, దేవదానం, వి.వెంకటేశ్వర్లు, కె.లక్ష్మయ్య, ఏ.చంద్రయ్య, పీఎల్ఎన్ రెడ్డి, మోహన్‌రావు, ఎంఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

నేరేడుచర్ల : ఇస్రో లాంచ్ చేసిన చంద్రయాన్– 3 విజయవంతం అయిన సందర్భంగా గురువారం నేరేడుచర్లలోని ప్రగతి విద్యాలయం విద్యార్థులు జాతీయ జెండాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూసేలా ఘన విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల చైర్మన్ కొప్పుల రంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కొప్పుల భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీలయ్‌నాయక్

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల గురువారం శ్రీశ్రీశ్రీ త్రిలింగేశ్వరస్వామి దేవాలయాన్ని మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీలయ్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

గరిడేపల్లి : నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీటిని తక్షణమే విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గానుగుబండలో నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నప్పటికీ సాగర్ నీరు రాకపోవడంతో పంట పొలాలు ఎండిపోయాయని తెలిపారు. ఆయన వెంట రైతులు ఈద నర్సమ్మ, మహేష్ ఉన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ పండుగ



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

మునగాల : మండల కేంద్రంలో గురువారం ముత్యాలమ్మ పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించగా, పోలీసులు ఎలాంటి సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మఠంపల్లి : యాతవాకిళ్లలో కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న వికలాంగులు, నాయకులు



చిలుకూరు : సీత్లాతండాలో వికలాంగులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

మఠంపల్లి : ప్రభుత్వం ఆసరా ఫించన్లు రూ.3,016 నుంచి రూ.4,016 లకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండలంలోని యాతవాకిళ్లలో వికలాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పెరిగిన ఫించన్లను స్థానిక సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు వికలాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మచ్చ వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్య యాదవ్, బైరి కాశయ్య, చిన్న శ్రీను, కొత్తూరు వెంకన్న, లచ్చయ్య, పెదనాగయ్య, లింగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


వికలాంగులకు పెన్షన్ల పంపిణీ

చిలుకూరు : ప్రభుత్వం వికలాంగులకు పెంచిన రూ.4,016 పెన్షన్ ఆగస్టు నుంచి అమలులోకి వచ్చింది. దీంతో గురువారం మండలంలోని సీత్లాతండా గ్రామంలో సర్పంచ్ ధీరావత్ మంగమ్మసైదులు వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ : పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని కౌన్సిలర్ కస్తాల శ్రావణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో మున్సిపల్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆర్చీ, నల్లా పైప్‌లైను పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గెల్లి రవి, కౌన్సిలర్ రాజా, నాయకులు వీరబాబు, సైదులు, ముత్తయ్య, శ్రీను, శౌరి బాబు, వెంకన్న, నాగార్జున పాల్గొన్నారు.

● ఎండిపోతున్న రైతుల ఆశలు



చిలుకూరులో ఎండిపోతున్న పొలం



సీతారాంపురంలో..



నారాయణపురంలో..

చిలుకూరు : వానలు లేక భూగర్భ జలాలు అడుగంటి మండల పరిధిలోని ఆయకట్టులో వరి పొలాలు ఎండిపోతున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు బాగానే కురవడంతో రైతులు ఆశతో బావులు, బోర్లు, చెరువుల కింద వరి పంట సాగు చేశారు. కానీ గత 20 రోజులుగా చినుకు కూడా పడకపోవడంతో బావులు, బోర్లలో నీరు అడుగంటి బోర్లు మూడు, నాలుగు గంటలు మాత్రమే పోస్తున్నాయి. దీంతో నీరు పారక వరి పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు గత్యంతరం లేక రెండు మూడు రోజులకు ఒక మడి చొప్పున వదిలేస్తున్నారు. చిలుకూరు మండలంలో సుమారుగా 21 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం 16 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 2 వేల ఎకరాల్లో పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ నీరు విడుదల చేసి వరి పంటను కాపాడాలని కోరుతున్నారు.

26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

● ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి

హుజూర్‌నగర్ : ఈనెల 26, 27 తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి తెలిపారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.